'ఛాంపియన్స్'

ఐసిసి ఛాంపియన్ ట్రోఫీలో భారత్ ఘన విజయం సాధించడంతో ఉమ్మడి జిల్లాలో క్రీడాభిమానుల సంబరాలు మిన్నంటాయి. యువత బైక్‌ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో చేరుకుని బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

దర్జాగా కబ్జా

పికెపి కాలువను కబ్జా చేసుకుని నిర్మించుకున్న గృహాలుల

చెరువు, నీటిపారుదల శాఖ కాలువల స్థలాలను వదలని దుస్థితి
ఆక్రమణకు గురైన పికెబి సప్లయ్ ఛానల్
నీటి సరఫరా కాలువలను మురుగు కాలువలుగా మార్చిన వైనం
నిద్రావస్థలో ఇరిగేషన్ అధికారులు

కాదేదీ కబ్జాకు అనర్హం.... అన్న చందంగా హిందూపురంలో ప్రభుత్వ స్థలం ఏ శాఖకు చెందినదైనాకబ్జాకు గురవుతోంది. కొందరు నీటిపారుదల శాఖ స్థలాలను కబ్జా చేసుకుని ఏకంగా వాణిజ్య భవనాలు, గృహాలను నిర్మించారు. వీరి బాటలోనే మున్సిపల్ అధికారులు నడిచారు. నీటి సరఫరా కాలువలను మురుగు కాలువలుగా మార్చారు. దీంతో పట్టణంలో ఉన్న చెరువులన్నీ మురుగుతో కంపు కొడుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు కబ్జాదారులతో ముడుపులు తీసుకుని తమకేమి తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.
ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి మూడు వైపులా ప్రధాన చెరువులు ఉన్నాయి. అనంతపురం వైపు కొట్నూరు చెరువు, బెంగళూరు రోడ్డు వైపు సూగురు చెరువు, లేపాక్షి వైపు శ్రీకంఠపురం చెరువు ఉన్నాయి. అయితే ఇందులో కొట్నూరు, సుగూరు చెరువు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఏకంగా కొందరు ప్లాట్లను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా హిందూపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని రియల్ దందాను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పెన్నా నది నుండి కొట్నూరు చెరువుకు నీరు అందించే పెన్నా కుముద్వతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సప్లై ఛానల్ (పీకేబీ) ఆక్రమణలకు గురైంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు పూడిక తీయించాల్సిన అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో పెద్ద ఎత్తున సప్లై ఛానల్‌లో మురుగు నిలబడి కంపు కొట్టడంతో పాటు కంపచెట్లు పెరిగిపోయాయి. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు సప్లై ఛానల్ పొడవునా నీటి పారుదల శాఖకు చెందిన స్థలాన్ని కబ్జా చేసుకుని ఇళ్లను నిర్మాణాలు చేసి వాటిని అద్దెకు సైతం ఇచ్చారు. పెన్నా నది ద్వారా నీరు ప్రవహిస్తే పరిగి రోడ్డు లోని కట్ట కాలువ గుండా ఆర్టీసీ కాలనీ సప్లై ఛానల్ మీదుగా కొట్నూరు చెరువుకు నీరు చేరాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆ సప్లై ఛానల్ ఆక్రమణలకు గురి కావడంతో పాటు ఉన్న సప్లై ఛానల్ లో కంపచెట్లతో పాటు పూడిక పెరిగిపోవడంతో నీరు పారే పరిస్థితులు కనిపించడం లేదు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నీటిపారుదల శాఖ అధికారులతో కుమ్మక్కై ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కబ్జాలకు పాల్పడినట్లు సర్వత్రా ఆరోపణల వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు పూడికను తీయించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం సప్లై ఛానల్ పరిస్థితి ఏమాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని గొల్లపల్లి రిజర్వాయర్ నుండి హంద్రీనీవా కాలువకు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. ఒకవేళ ఆ నీరు హిందూపురం పట్టణంలో ప్రవహించాల్సి వస్తే సప్లై ఛానల్ పూర్తిగా ఆక్రమణలకు గురి కావడం, పూడికతో పాటు చెట్లు ఏపుగా పెరిగి పోవడంతో నీరు ఎలా ప్రవహిస్తుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు నీటిపారుదల శాఖకు సంబంధించిన సప్లై ఛానల్ ఆక్రమణలకు గురికాగా అదే తరహాలో మున్సిపల్ కాలువలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది మున్సిపల్ కాలువలను ఆక్రమించుకొని యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే తరహాలోనే మున్సిపల్ అధికారులు సైతం మున్సిపల్ ఖజానాను కొల్లగొట్టేందుకు నీటి పారుదల శాఖకు చెందిన కాలువలను సిమెంట్ వేసి, దానిని మురుగు కాలువలుగా మార్చి కోట్లు కొల్లగొట్టారు. ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో సుప్రీంకోర్టు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కొట్నూరు చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేయగా అప్పట్లో రాజకీయ కారణాలతో వెనుదిరిగారు. ప్రస్తుతం ఆ చెరువు పరిధిలోని స్థలం దాదాపు కబ్జాకు గురై ఏకంగా పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరిగాయి. సాధారణంగా చెరువు స్థలాలకు ఎలాంటి పట్టాలను అధికారులు మంజూరు చేయడం జరగదు. అయితే చెరువు ముంపు ప్రాంతాల్లో ఉన్న స్థలాలకు పట్టాలు కూడా మంజూరు కావడం గమనార్హం. అదే విధంగా ఆయా కాలనీలో మున్సిపల్ అధికారులు రహదారులు, వీధి దీపాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో రోజురోజుకి చెరువు స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అదే విధంగా సూగూరు చెరువు ప్రాంతం కూడా ఆక్రమణలకు గురవుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు చెరువు స్థలాలపై కన్నేసి బినామీలను ఏర్పాటు చేసుకొని కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్న ధీమాతో ఏకంగా పెద్ద ఎత్తున నిర్మాణాలను సైతం చేసుకొని అద్దెకు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కాగా సాధారణంగా సప్లై ఛానల్, మున్సిపల్ పెద్ద కాలువల పరిసరాల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ అవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. ఏకంగా సప్లై ఛానల్, మున్సిపల్ మురుగు కాలువలను ఆనుకొని, వాటిపైన అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఇప్పటికైనా నీటిపారుదల, మున్సిపల్ అధికారులు నిద్ర మేల్కొని ఆక్రమణలు గురైన సప్లై ఛానల్, మురుగు కాలవలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఈ అక్రమాలపై ఆయా శాఖల అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సుంది.


కాలువలో దట్టంగా పెరిగిన ముళ్ల కంపలు, చెట్లు

నీటిపారుదల శాఖ కాలువను మురుగు కాలువగా మార్చిన దృశ్యం

పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

చట్ట సవరణను వెనక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంటు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం (డిపిడిపి చట్టం) లోని సెక్షన్ 44(3) ద్వారా ఆర్టీఐ చట్టాన్ని సవరించిందని దీంతో సమాచార హక్కు చట్టం బలహీన పడుతుందని, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ద్వారా ఆర్టీఐ చట్టానికి చేసిన సవరణలను వెనక్కి తీసుకోవాలని సమాచార హక్కు చట్ట అవగాహన సంస్థ రాష్ట్ర కన్వీనర్ హబీబ్ ఉర్ రహమాన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో సమాచార హక్కు చట్ట అవగాహన సంస్థ ప్రతి నిధులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేశ వ్యాప్తంగా భారతీయ పౌరులు ప్రభుత్వాల ద్వారా తమకు అవసరం వున్న సమాచారాన్ని హక్కుగా పొందుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వాలను జవాబుదారీగా ఉంచడానికి పౌరులకు వున్న ఒకే ఒక్క చట్టం సమాచార హక్కు చట్టం అన్నారు. ప్రస్తుతం డిపిడిపి చట్టం సెక్షన్ 44(3) ద్వారా ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె) కు చేసిన సవరణ ద్వారా అన్ని రకాలైన వ్యక్తిగత సమాచారాన్ని సమాచార హక్కు పరిధి నుండి మినహాయించాలని చూస్తున్నారని విమర్శించారు. ఇంతకు మునుపు వ్యక్తిగత సమాచారం ఏదైనా ప్రజా కార్యకలాపాలకు లేదా ప్రజా ప్రయోజనాలకు సంబంధం లేకుంటే మాత్రమే తిరస్కరించబడుతుందని, లేదా వ్యక్తిగత గోప్యత హక్కుకు కారణం లేకుండా భంగం కలిగిన సందర్భాల్లో మాత్రమే సమాచారం ఇవ్వటంలో మినహాయింపు ఉంటుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఐ కార్యకర్తలు, ఆర్టీఐ సంస్థలు, ఆర్టీఐ చట్టం పై అవగాహన వున్న ప్రతి ఒక్కరు డిపిడిపి చట్టంలోని సెక్షన్ 44(3) అమలు జరగకుండా తిరస్కరించాలని కోరారు. ఈ విషయంపై తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఆందోళనకు సంబంధించి కార్యచరణను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సంస్థ జిల్లా అధ్యక్షులు జి.సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరి చిన్నపోతలయ్య, రెవిన్యూ డివిజన్ అధ్యక్షులు షేక్ అయాజ్, హిందూపూర్ మండల అధ్యక్షులు వి.చంద్రశేఖర్, హిందూపూర్ మండలసెక్రటరీ మనోజ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-హిందూపురం

సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ ప్రమీల

రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లు ప్రతి ఒక్కరు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించినప్పుడే సమస్యలను పరిష్కరించుకోవడానికి సాధ్య మవుతుందని ఎపి యునైటెడ్ స్కూల్స్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ ప్రమీల పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణంలో ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్ అనుబంధ సంఘమైన ఏపీ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అశోక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కన్వీనర్ ప్రమీల పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు కష్టపడి పని చేస్తున్నప్పటికీ వీరిని వర్కర్లుగా ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలను వీరికి ఇచ్చి వీరి శ్రమను ప్రభుత్వం దోచుకుంటున్నదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీరిని తొలగించడం అన్యాయమన్నారు. అందరికీ న్యాయం జరగాలన్నా పెండింగ్ లో ఉన్న వేతనాలు సాధించాలన్నా, వేతనాలు పెరగాలన్నా, ఈ ఎస్ ఐ, పీఎఫ్, గ్రాజిటీ సదుపాయం సాధించుకోవాలన్నా ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమవుతుందని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదేవిధంగా జిల్లా స్కూల్ వర్కర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా శ్రీరాములు, కార్యదర్శిగా మమత, అడ్వైజర్ గా అశోక్ తో పాటు 20 మంది కౌన్సిల్ మెంబర్లతో జిల్లా కమిటీని ఎంపిక చేసుకున్నారు. ఈ సదస్సులో నాయకులు రామకృష్ణారెడ్డి, రమేష్, మంజునాథ్, హరి, ప్రసాద్, రజనీ పాల్గొన్నారు.

డాక్టర్ నాగేంద్ర కుమార్‌కు సేవా రత్న లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం

విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ థియలాజికల్ యూనివర్సిటీ 32వ స్నాతకోత్సవ కార్యక్రమంలో హిందూపురం పట్టణానికి చెందిన డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకమైన సేవా రత్న లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్ నందు సంఘ పెద్దలు, యువకులు ఆదివారం అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ సత్కారం సమాజం పట్ల తన బాధ్యత పెంచిందని, శక్తి వంచన లేకుండా భవిష్యత్తులో కూడా ఉద్యోగ బాధ్యతలతో పాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఈ ప్రాంత, రాష్ట్ర, దేశ అభివృద్ధిలో పాలుపంచుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతి నిధులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు అమలయ్యే వరకు పోరాటం

సామాజిక వేత్త దేవి
'అనంత'లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సామాజిక వేత్త దేవి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళలకు సమాన హక్కులు అమలు అయ్యే వరకు మహిళాలోకం ఐక్యమత్యంతో పోరాడుదామని ప్రముఖ సామాజిక వేత్త దేవి అన్నారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. అనంత మహిళా వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక లలితకళాపరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిష్ణ కళామందిరం నుంచి లలితకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాకుమారి ర్యాలీని ప్రారంభించారు. వేలాదిగా మహిళలు, విద్యార్థినిలు ర్యాలీలో పాల్గొని నృత్య ప్రదర్శన, కోలాటం, వంటి ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం లలితకళాపరిషత్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంత మహిళ వేదిక సభ్యులు, ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన అధ్యక్షతన డాక్టర్ హేమలత ఆహ్వానితులుగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సామాజిక వేత్త దేవి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెనరాబ్యాంక్ రీజనల్ మేనేజర్ యాదయ్య, ప్రాంగణం అధికారి వనజా అక్కమ్మ, లక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత సందీప్‌కుమార్, రెడ్స్ భానుజా, ఇన్నర్‌వీల్ జయంతి, శ్రీవల్లి, స్టాఫ్ నర్స్ అసోసియేషన్ లత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య వక్తగా హాజరైన సామాజికవేత్త దేవి మాట్లాడుతూ 78 స్వాతంత్ర్యంలోనూ మహిళలకు సమాన హక్కులు లేవన్నారు. సమాజంలో కుటుంబం నుంచి ఆడ, మగ వ్యత్యాసం ఉందని, ఆస్తి హక్కులో సమానత్వం కొరవడిందని అన్నారు. సమానత్వం కోసం పోరాడుతున్నది మగవారి మీద కాదని, మహిళలు సమానులు కాదని చెప్పే భావాలపై అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం రెండు ఒక్కటే అని వాటి సాధన కోసం కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ తాను మహిళగా ఐఎఎస్ చదివి మీ ముందు అధికారిగా నిలవడానికి తల్లి తండ్రులు, గురువుల ప్రోత్సాహం, తన పట్టుదల, ఉన్నత ఆశయంతోనే సాధ్యమైందన్నారు. ప్రాంగణం అధికారి వనజా అక్కమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు దోహదపడాలన్నారు. కెనరా బ్యాంక్ ఆర్ఎం యాదయ్య మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్ రక్షణ బీమా సౌకర్యం కెనరా బ్యాంక్ కల్పిస్తోందన్నారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ మహిళా సమానత్వం సాధన కోసం త్వరపడి పని చేయాలన్నారు. లలిత కళాపరిషత్ పద్మజ, డాక్టర్ హేమలత మాట్లాడుతూ 25 అసోసియేషన్‌లు సంయుక్తంగా అనంత మహిళా వేదికగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలకు ప్రశంసా పత్రాలతో సన్మానించారు. లక్ష్మి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో వారికి చీరలు అందజేశారు. అనంతరం విద్యార్థినులు, మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు బృందా, జెవివి నాయకులు లక్ష్మి, శశికళ, మాధవిలత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, శ్రామిక మహిళా నాగమణి, ఐద్వా చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, యుటిఎఫ్ నాయకులు సరళ, మున్సిపల్ వర్కర్స్ లక్ష్మినరసమ్మ, ఆశా యూనియన్ లక్ష్మి, మధ్యాహ్న భోజనం పద్మావతి, 108 యూనియన్ అనిత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్పీ వి. రత్న

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని ప్రజలకు పోలీసులు పట్ల మంచి అభిప్రాయం ఏర్పడే విధంగా విధులు నిర్వర్తిస్తున్నామని ఆ జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలాంటి వారైనా ఉపేక్షించబోమని రాజకీయ ఒత్తిడిలకు తలోగ్గమని తెలిపారు

ప్రశ్న : జిల్లాలో మహిళల భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో మహిళలు, విద్యార్థినుల పట్ల అఘాయిత్యాలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నాం. వారికి ఎలాంటి రక్షణ కల్పించాలన్న దృక్పథంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలాంటివారికి ఉద్యోగరీత్యా వేధింపులు, అఘాయిత్యాలు తరచూ జరుగుతున్నాయి వాటిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నెలరోజులు పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు ఆత్మ రక్షణే కాదు మహిళ సాధికారిక సవాళ్లు వాటిని అధిగమించడం పట్ల అవగాహనలు, ప్రేమ వ్యామోహం, సోషల్ మీడియా, వంటి వాటికి ఆకర్షితులు కాకుండా ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

ప్ర : జిల్లాలో శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న చర్యలు?

జ: జిల్లాలో యువత ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే వారు ఎలాంటి వారైనా ఉపేక్షించబోం. గంజాయి, డ్రగ్స్ ,కర్నాటక మద్యం అక్రమ రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. జిల్లాలో కర్నాటక సరిహద్దు ప్రాంతం ఎక్కువ ఉన్న కారణంగా కొంతమేర నేరస్తులను వెంటనే గుర్తించలేకపోతున్నాం. అక్రమ రవాణా నిర్వహించే వారిపై సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కర్నాటక సరిహద్దు పోలీస్ స్టేషన్లో చెక్‌పోస్టులలో పోలీసుల నిఘా ఉంచి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం.

3) ఇటీవల జిల్లాలో నేరాల సంఖ్య పెరిగిపోవడం పై మీ అభిప్రాయం?

జ : జిల్లావ్యాప్తంగా నేరాల సంఖ్య గతం కంటే ఈ సంవత్సరం తగ్గుముఖం పట్టింది. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా నేరస్తులు మన జిల్లాలో దొంగతనాలకు పాల్పడం, చిన్న చిన్న విషయాలకు, భూ, స్థల సమస్యలకు, గొడవలకు కేసులు కావడంతో నేరాల సంఖ్య అధికంగా ఉంది. ముఖ్యంగా బంగారు, వెండి, డబ్బుల దొంగతనాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కోర్టులకు హాజరు పరుస్తున్నాం. ఇటీవల మూడు నెలలు లోపే దొంగలించిన రూ.40 లక్షల విలువ చేసే 301 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశాం. ఎవరైనా బాధితులు ఎలాంటి వస్తువులను పోగొట్టుకున్న, దొంగలించబడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

4) జిల్లాలో నేర నియంత్రణకు చేపట్టే చర్యలేవీ?

జ : శ్రీ సత్య సాయి జిల్లాలో ఇటీవల యువతలో ఎక్కువ శాతం ఉద్యోగాలకు పనులకు వెళ్లకుండా సులభంగా డబ్బు సంపాదించే మార్గాల అన్వేషణలో పడ్డారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, కళాశాలల్లో, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోలీసులు పల్లెనిద్రలు, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేరాలను పసిగట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశాం. లాడ్జులు, ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు ,భవనాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. వీటి ద్వారా నేరాలను నియంత్రించడమే కాక నేరం జరిగిన చోట వ్యక్తులను వెంటనే గుర్తించవచ్చు. దాంతో నేరాలు సైతం తగ్గుముఖం పడతాయి.

ప్రజాశక్తి www.prajasakti.com

నేడు పుట్టపర్తికి మంత్రి లోకేష్ : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం విమానంలో సత్యసాయి విమానాశ్రయానికి వచ్చి, ఆ తర్వాత రోడ్డు మార్గంలో కదిరికి వెళ్లారని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి సోమవారం సాయంత్రం 4:15 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి 5 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కదిరికి 6.15 గంటలకు చేరుకుంటా రన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అనంతరం కదిరి నుంచి రోడ్డు మార్గంలో కడప విమానాశ్రయం వెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్తారని తెలిపారు.

విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఆదివారం ఎస్పీ వి.రత్న సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే మంత్రి పర్యటనలో భద్రత పరంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ శాఖ పరంగా అన్ని భద్రతాపరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కదిరి పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం లోపల, బయట తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచించారు. ఆలయ సమీపంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డిఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిఐలు సునీత, సురేష్, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

ఖాద్రీశునికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి

కదిరి అర్బన్ : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం సాయంత్రం సత్యసాయి ఎయిర్ పోర్ట్‌కి చేరుకుంటారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సాయంకాలం 5:30 మలకవేముల క్రాస్ మీదుగా కదిరి రూరల్ మండలంలోని పట్నం, కాలసముద్రం, ఎర్రదొడ్డి, కుటాగుళ్లకు చేరుకుంటారన్నారు. పులివెందుల క్రాస్ రోడ్డు దగ్గర నుంచి పెద్దఎత్తున బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలుకుతామన్నారు. అనంతరం రోడ్డు మార్గాన ఖాద్రీ భవనాల అతిథి గృహం చేరుకుంటారన్నారు. రాత్రి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గాన కడప ఎయిర్ పోర్ట్‌కి చేరుకుంటారు. మంత్రి పర్యటనలో కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ట్రాఫిక్ ఆంక్షలు విధింపు : సిఐ

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు.

పుట్టపర్తి విమానాశ్రయంలో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ పాట్లు..!

వలసదారులు, డీలర్ మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి-గుడిబండ

ఈకేవైసీ చేయించుకునే క్రమంలో ఆదివారం మండలంలోని కొంకల్లు గ్రామంలో రేషన్‌షాపు డీలర్, కార్డుదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రేషన్ కార్డుదారులు గడువులోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని, లేనిచో ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర సరుకులు అందవని ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడింది. దీంతో పొట్టకూటి కోసం బెంగళూరు, తుమకూరు, తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఆదివారం ఫ్యాక్టరీలకు సెలవు ఉండడంతో చాలా మంది స్వగ్రామాలకు వచ్చి ఉదయమే సంబంధిత రేషన్ షాపు వద్దకు బారులు తీరారు. అయితే ఉదయం పూట ఈకేవైసీ చేయమని సాయంత్రం వస్తే చేయించుకుంటామని డీలర్ తేల్చి చెప్పారు. దీంతో కార్డుదారులు తమ సాధక బాధకాలను చెప్పి ఎంత బతిమాలినా డీలర్ ససేమిరా అనడంతో వారి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు కార్డుదారులు డీలర్ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని డీలర్‌కు నచ్చజెప్పడంతో ఈకేవైసీ చేయడానికి ఒప్పుకున్నారు. అయితే కొందరికి మాత్రమే ఈకేవైసీ చేశారని, చాలా మందికి చేయలేదని పలువురు కార్డులబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వలస వెళ్లిన రేషన్ కార్డుదారులకు వెసులుబాటు కల్పించి మండలంలోని ఏషాపులోనైనా ఈకేవైసీ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డీలర్‌తో వాగ్వాదానికి దిగిన రేషన్ కార్డుదారులు

నేడు కలెక్టరేట్ ముట్టడి

జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్‌లోని 7 మండలాలకు చెందిన రైతులు, రైతు కూలీల సమస్యలపై సోమవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయ కులు జంగాలపల్లి పెద్దన్న ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ వార్షిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు మేలు చేసే ప్రధాన అంశాలేవీ లేవన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎన్నో ఏళ్ల నుంచి కరువు కాటకాలకు నిలయమని, ఇలాంటి ప్రాంతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తాడిమర్రి మండలంలో అదానీ సంస్థ చేస్తున్న విధ్వంసం ఆ ప్రాంత రైతులు పండిస్తున్న పంటలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. వీటితో పాటు అనేక సమస్యలపై కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

ముదిగుబ్బ : రైతుల సమస్యలపై చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో మండల నుంచి రైతులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం, సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్ ధర తగ్గించాలని, విద్యుత్ అదనపు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల రద్దు, ముదిగుబ్బలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలోని జెకె పల్లి రెవెన్యూ పొలంలో ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా కాపాడాలన్నారు. చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి రైతుల అవసరాల నిమిత్తం విక్రయాలకు దోహదపడాలన్నారు. కస్తూర్బా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ముదుగుబ్బ రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్ పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న

అసాంఘిక కార్యక్రమాల జోలికెళ్లొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. రూరల్ పరిధిలోని వసంతపురం గ్రామంలో ఆదివారం ఎస్ఐ సిబ్బందితో కలిసి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు గొడవలు, పేకాట, మట్కా, మద్యం, తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

కంచిసముద్రంలో పోలీసుల పల్లెనిద్ర

లేపాక్షి : మండలంలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐ జనార్దన్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రధానంగా ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి : కంచిసముద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

నాటుసారాపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు ఆదివారం నాటుసారాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నల్లమాడ, బుక్కపట్నం మండలాల పరిధిలోని రెడ్డికుంటతండా, నీరాలవంక తండా, మదిరేబయలుతండా గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందనాయక్, పుట్టపర్తి ఎక్సైజ్ సిఐ నాగరాజు, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ఉమామనోహర్‌రాజు పాల్గొని ప్రసంగించారు. ఆయా గ్రామాల్లో సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు నాటుసారా వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. నాటుసారా తయారీ, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతిక్రమిస్తే అమలు చేసే శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుట్టపర్తి అటవీ శాఖ అధికారులు, వీఆర్‌ఏ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నూతన విద్యావిధానాన్ని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, నూతన విద్యా విధానాన్ని అందిపుచ్చుకోవాలని బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ సూచించారు. కదిరి రూరల్ పరిధిలోని ఎర్రదొడ్డి గంగమ్మ మోరీ వద్ద ఉన్న బ్లూమూన్ స్కూల్‌లో ఆదివారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాబోయే రోజుల్లో విద్యలో మార్పులకు అనుగుణంగా నూతన విధానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఐఐటి, జెఈఈ, నీట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు విద్యార్థులు ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి బ్లూమూన్ విద్యాసంస్థలో ఇంటర్మీడియట్లో ఐఐటి, నీట్ ఫౌండేషన్ విద్యా విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి ఇస్తున్న కరస్పాండెంట్ శివశంకర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అధికారులు హరికృష్ణ, గణేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ధర్మవరం రోడ్డులోని ఎస్ఎల్‌వి ఫంక్షన్ హాలులో ఆదివారం జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల తృతీయ వార్షికోత్సవ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కార్తీక్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డివి.సంధ్య, ఉపాధ్యక్షులుగా చందన, ఉమ, జనరల్ సెక్రటరీగా శ్రీదేవి, జాయింట్ సెక్రటరీగా నందీశ్వర, సబిత, ట్రెజరర్‌గా వేణుగోపాల్‌నాయక్, రమ్య, జయతేజ్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్లుగా హరికృష్ణ, గణేష్ కుమార్ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ సిహెచ్‌ఒల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం దిశగా పని చేస్తానని తెలిపారు.

సమావేశమైన కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల

11న కాటికాపరుల సమస్యలపై మహాధర్నా

ప్రజాశక్తి-గోరంట్ల

కాటికాపరుల సమస్యలపై ఈ నెల 11వ తేదీ విజయవాడలో ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఎర్రబల్లి, మల్లాపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. హనుమయ్య మాట్లాడుతూ తరతరాల నుంచి కుల, మతాలు తేడా లేకుండా శ్మశానంలో పనిచేస్తున్న కాటికాపరులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా కాటికాపరులకు నెలకు రూ. 8వేల పెన్షన్, గుర్తింపుకార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. దళితుల శ్మశాన వాటికకు రెండెకరాల స్థలం కేటాయించాలన్నారు. ఆయా సమస్యలపై చేపట్టనున్న మహాధర్నాకు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటికాపరులు వెంకటరమణ, నరసింహులు, అంజనప్ప, మునియప్ప, శివప్ప, గోవిందప్ప, నారాయణ, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకూ కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని, అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తనకల్లులోని ఎపి గిరిజన గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన ప్రవేశాల కోసం గిరిజన బాలికలు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని, బ్లాక్ లాగ్ తరగతులు 6వ తరగతికి 15, 7వ తరగతికి 1, 8వ తరగతికి 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ 6వ తేదీ గిరిజన గురుకుల పాఠశాల తనకల్లులో రాత పరీక్ష నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థినులను ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ 9493360217 లేదా 9652580709 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలో ప్రతినెలా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎండిఎం ఆపరేటర్ల సమస్యతో డీలర్లు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండిఎం ఆపరేటర్లతో సంబంధం లేకుండా డీలర్లే వేలిముద్రలు వేసుకొని రేషన్ సరుకులు సకాలంలో సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో త్వరలోనే రేషన్ కార్డుదారులతో కలిసి ముదిగుబ్బలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

చల్లా శ్రీనివాసులు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ జనార్దన్

రోడ్డు నిబంధనలు పాటించండి : సిఐ

ప్రజాశక్తి-లేపాక్షి

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని సిఐ జనార్దన్ సూచించారు. లేపాక్షి నుంచి కోడూరు గ్రామం వెళ్లే కూడలిలో ఆదివారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేంద్ర, పోలీసులు ద్విచక్ర వాహనదారులు, డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనం నడిపితే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చు అన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు కలిగిన ఉండాలన్నారు. ఎవరూ ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. రోడ్డు నియమాలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మపురం నూరాని మసీద్ వద్ద ఆశ్ ను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ఉపవాస దీక్ష ఆచరించే వారికి ఆశ్ పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఆచరించే వారి కోసం హిందూపురం పట్టణంలోని ధర్మపురం నూరాని మసీద్ వద్ద రంజాన్ మొదటి రోజు నుంచి ఆశ్ ను సిద్ధం చేసి పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు, మసీదు ముతవల్లి అల్ హాజ్ క్వాలిటీ నాసీర్ సాహెబ్ మాట్లాడుతు ఆశ్ అన్నది తమిళనాడుకు చెందిన వంటకం అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షను ఆచరించడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుందన్నారు. శరీరంలో ఉష్ణోగ్రతను తగ్గించడానికి ఆశ్ వంటకం చాల ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి రోజు ఆశ్ ను సిద్ధం చేసి ధర్మపురంతో పాటు పట్టణ వ్యాప్తంగా వందలాది మంది దీనిని తీసుకెళ్తున్నారన్నారు. నిర్వహణ కోసం కమిటీతో పాటు మసీదు యువజన కమిటీ వారు పూర్తిగా సహకారం అందిస్తున్నారన్నారు. వీరితో పాటు పట్టణ ప్రముఖులు సైతం సహకరించడం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. రంజాన్ మాసం పూర్తి అయ్యే వరకు ప్రతి రోజు సాయంత్రం ఆశ్ ను సిద్ధం చేసి 5 గంటల నుండి పంపిణీ చేస్తామన్నారు.

ఉపవాస దీక్ష ఆచరించిన వారికి ఆశ్ పంపిణీ చేస్తున్న ముస్లింలు

చేనేత కళాకారుల ప్రతిభకు ఢిల్లీలో గుర్తింపు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

దేశ రాజధాని న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తున్న ఓ ప్రత్యేక కార్యక్రమానికి ధర్మ వరం పట్టణానికి చెందిన డిజైనర్ జూజారు నాగరాజుకు ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో ఆదివారం జూజారు నాగరాజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేనేత రంగం, కళాకారుల గురించి మాట్లాడారు. అందులో ప్రధానంగా ధర్మవరం చేనేత కార్మికుల నైపుణ్యం, వారి ఆర్థిక స్థితిగతులను వివరించారు. అలాగే ధర్మవరం చేనేత కార్మికులు తయారు చేసిన పట్టుచీరలు, పట్టు పావడాలను చూపెట్టి వాటి తయారీ గురించి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ చిత్రంతో కూడిన పట్టు శాలువాను డిజైనర్ జూజారు నాగరాజు, ధర్మవరం చేనేత కళాకారుల తరపున రాష్ట్రపతికి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డిజైనర్ జూజారు నాగరాజు, చిప్పల మార్కండేయ పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్ వద్ద డిజైనర్ నాగరాజు

ఎల్-4 కాలనీలో ఇల్లు కూల్చివేత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ఎల్-4 కాలనీలో ఆదివారం ఉదయం ధర్మవరం-బెంగళూరు రహదారి పక్కన వున్న ఓ ఇంటిని కొందరు వ్యక్తులు జెసిబితో కూల్చి వేశారు. బాధిత దంపతులు ఎం.లక్ష్మీ, శ్రీనివాసులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు మా ఇంటి వద్దకు వచ్చి ఈ స్థలం తమదని గొడవ పడుతున్నారన్నారు. ఈ క్రమంలో ఓ మాజీ కౌన్సిలర్ భర్త జెసిబి, అనుచరులతో వచ్చి తమ ఇంటిని నేల మట్టం చేశారని వాపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత దంపతులు

విద్యాపీఠం హాల్ టికెట్లు విడుదల

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 17వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు హాల్ టికెట్లను స్టడీ కేంద్రాల్లో గాని వాట్సప్ ద్వారా గాని పొందవచ్చునని జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్ తెలిపారు. 9వ తేదీ నుంచి వాట్సప్ 9552300009 నెంబర్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అన్నారు.

సెక్రటరీపై దాడి హేయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పుట్టపర్తి మండలంలోని పెడపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డిపై ప్రయివేటు వ్యక్తులు దాడి చేయడం హేయమైన చర్య అని పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు పేర్కొన్నారు. రంగప్ప, తిప్పన్న అనే వ్యక్తులు సచివాలయానికి వచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఆస్తి మదింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా అలా ఇవ్వలేమని చెప్పిన పంచాయతీ కార్యదర్శిపై నానా దుర్భాషలాడి భౌతిక దాడి చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యద్శి ఈశ్వర్, ఉపాధ్యక్షులు గోపి, గణేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థిని కె.నిషితకు బహుమతి అందజేస్తున్న ప్రముఖులు

వధాన్య ట్యాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-లేపాక్షి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత డిసెంబర్ 22వ తేదీ పుట్టపర్తిలో వధాన్య ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అందులో పులమతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.నిషిత లేపాక్షి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఆమె ఆదివారం ముఖ్య అతిథుల నుంచి అవార్డుతో పాటు రూ. 4వేల నగదు, సర్టిఫికెట్ అందుకుంది. నిశితను పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు అభినందించారు.

కొండపై చెట్లకు నిప్పు

రాయదుర్గం : పట్టణ సరిహద్దున ఉన్న యల్లమ్మ కొండపై చెట్లకు ఆదివారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెట్లకు నిప్పు పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవికాలంలో తరచూ కొండపై ఉన్న చెట్లకు నిప్పు పెడుతుండటంతో చెట్లు కాలిపోతూ ఉంటాయి. దీంతో కొండపై పచ్చదనం అంతరించిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించి నిప్పు పెట్టకుండా చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

కొండలో చెలరేగుతున్న మంటలు

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు సమీపంలోని రైల్వే గేట్ వద్ద రైల్వే బ్రిడ్జి కింద ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి రైలు కింద పడటంతో తల, మొండెం, కాళ్లు, చేతులు ముక్కలు ముక్కలుగా తెగిపడ్డాయి. లోకోపైలెట్ సమాచారం ఇవ్వడంతో హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి సమీప గ్రామాల్లోని వ్యక్తి అయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 9441238 182 నెంబర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు.

అగ్నిప్రమాదం.. రూ. 2.8 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-నల్లచెరువు

అగ్ని ప్రమాదం జరిగి రూ. 2.8 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం నల్లచెరువులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వాసన్ సంస్థకు చెందిన వేరుశనగ మిల్లులోకి మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లి అక్కడ సిగరెట్ తాగి ఆర్పి వేయకుండా పడేయడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో వేరుశనగ పొట్టు దగ్ధం కావడంతో సుమారు రూ. 2.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు వాసన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మిల్లుకు సమీపంలో పాడి రైతు ఆదినారాయణ పశువుల కోసం నిల్వ ఉంచిన వరి గడ్డి వామి కూడా మంటలకు దగ్ధం కావడంతో రైతుకు రూ. 30 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

వేరుశనగ మిల్లులో కాలిబూడిదైన పొట్టు